ప్రజాశక్తి

మంగళవారం 14 ఫిబ్రవరి 2023 5

అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు

◆సప్లిమెంటరీకి అవకాశం ఇవ్వండి

◆ఎస్‌కెయు వద్ద ఐక్య విద్యార్థి సంఘాల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ తప్పిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించకుండా వారి జీవితాలతో ఆడుకోవద్దని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. డిగ్రీ తప్పిన విద్యార్థులు అందరికీ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని కోరుతూ ఐక్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం యూనివర్సిటీ వద్ద ఉన్న శ్రీకష్ణదేవరాయల విగ్రహం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర యాదవ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు హేమంత్ కుమార్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ అబ్బాస్, ఎఐఎస్‌ఎ రాష్ట్ర అధ్యక్షులు వేమన్న, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వీరేంద్ర, బీఎస్పీ నాయకులు హరి ప్రసాద్ మాట్లాడుతూ శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు సంవత్సరం, సెమిస్టర్ ప్రకారం సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. జనవరి 24వ తేదీన డిగ్రీ మూడు సంవత్సరాలను ఐదు సంవత్సరాలలోపు పూర్తి చేయాలనే సర్క్యులర్ పంపారన్నారు. జనవరి 31వ తేదీ డిగ్రీ మూడు సంవత్సరాలను మూడు సంవత్సరాల్లోపు పూర్తిచేయాలంటూ మరో సర్క్యులర్ జారీ చేశారని చెప్పారు. వారం రోజుల వ్యవధిలో ఎస్‌కెయు అధికారులు ఇష్టానుసారంగా ఇలా సర్క్యులర్లను ఎలా విడుదల చేస్తారని చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానం అమలు జరుపుతామంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం అడడం సరికాదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఎస్‌కెయు పరిధిలో ఒకటి, రెండు సబ్జెక్టులు మిగిలిపోయిన విద్యార్థులు దాదాపు నాలుగు వేల మంది ఉన్నారని తెలియజేశారు. సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించకపోతే వీరంతా నష్టపోతారని చెప్పారు. ఈ విద్యార్థులను దష్టిలో పెట్టుకుని మెగా సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌కెయుకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వం దీనిపై స్పందించకుంటే విద్యార్థులతో కలిసి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చంద్రశేఖర్, సంజీవ్ నాయక్, రాజశేఖర్, పవన్, ప్రకాష్, మురళి, సుదర్శన్ పాల్గొన్నారు.

పైపైకి పాతాళగంగ..!

◆20 ఏళ్లలో ఇదే రికార్డు ◆వర్షపాతం ద్వారా 233.53 టిఎంసిల నీరు ◆ఒడిసిపట్టింది 28.02 టిఎంసిలు

20 సంవత్సరాల్లో ఫిబ్రవరి మాసంలోనున్న భూగర్భ జల మట్టాలు

సంవత్సరం	నెల	భూగర్భ జలమట్టం (మీటర్లలో)
2001	ఫిబ్రవరి	10.82
2002	ఫిబ్రవరి	8.13
2003	ఫిబ్రవరి	13.97
2004	ఫిబ్రవరి	16.81
2005	ఫిబ్రవరి	19.43
2006	ఫిబ్రవరి	12.88
2007	ఫిబ్రవరి	16.72
2008	పిబ్రవరి	12.56
2009	ఫిబ్రవరి	11.47
2010	ఫిబ్రవరి	12.55
2011	ఫిబ్రవరి	11.33
2012	ఫిబ్రవరి	15.01
2013	ఫిబ్రవరి	17.42
2014	ఫిబ్రవరి	16.76
2015	ఫిబ్రవరి	21.78
2016	ఫిబ్రవరి	15.89
2017	ఫిబ్రవరి	23.91
2018	ఫిబ్రవరి	17.28
2019	ఫిబ్రవరి	23.39
2020	ఫిబ్రవరి	18.84
2021	ఫిబ్రవరి	11.23
2022	ఫిబ్రవరి	7.63
2023	ఫిబ్రవరి	5.81

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం క్షామ ప్రాంతంగా ఉండే అనంతపురం జిల్లాలో వర్షాభావంతో భూగర్భ జలాలు ఎప్పుడూ పాతాళంలోనే ఉండేది. దీని కోసం రైతులు వెయ్యి అడుగుల వరకు బోర్లు వేసినా ప్రయోజనముండేది కాదు. అయితే వాతావరణంలో వచ్చిన మార్పులో ఏమోగానీ గడిచిన మూడు సంవత్సరాలుగా వర్షాలు బాగా పడుతున్నాయి. దీంతో భూగర్భ జలాలు పైకొచ్చాయి. 20 ఏళ్లలో ఎన్నడూలేనంత పైకి ఈసారి వచ్చాయి. ప్రస్తుతం జిల్లాలో సగటున 5.81 మీటర్ల ఎత్తులో భూగర్భ జలాలు ఉన్నట్టు భూగర్భ జల శాఖ నివేదికలు చెబుతున్నాయి. 2022 నవంబర్ అయితే 4.94 మీటర్ల ఎత్తులోనే నీరు ఉండింది. ఇప్పుడు అవి 5.81 మీటర్ల లోతుకు చేరింది. అంతకు మునుపు సంవత్సరం కంటే చూస్తే ఈసారి 3.37 మీటర్ల నీటి మట్టం పెరిగింది.

20 సంవత్సరాల్లో ఇప్పుడు అత్యధికం

2000 సంవత్సరం నుంచి రాష్ట్రంలో భూగర్భ జలాల నీటి మట్టాన్ని పిజియో మీటర్ల ద్వారా కొలుస్తున్నారు. అంతకు మునుపు దిగుడు బావుల్లో నీటి మట్టాలను కొలిచి లెక్క గట్టేవారు. 2000 సంవత్సరం నుంచి పిజియో మీటర్ల ద్వారా బోరు బావుల్లోకి పరికరాలను పంపి నీటిని సాంకేతిక పద్ధతలో లెక్క గట్టడం ప్రారంభమైంది. అప్పటి నుంచి చూస్తే ఉమ్మడి జిల్లాలో మొత్తం 190 ప్రాంతాల్లో

లెక్కిస్తున్నారు. ప్రత్యేకంగా అనంతపురం జిల్లాలో అయితే 97 ప్రాంతాల్లో లెక్కిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి చూసినప్పుడు సగటున ఏటా 11 మీటర్ల నుంచి 22 మీటర్ల లోతున బోరుబావుల్లో నీరు లభించేవి. గడిచిన రెండేళ్లుగా అధిక వర్షాలతో నీరు పైకి రావడంతో భూగర్భ జలాలు ఐదు మీటర్లకు చేరువగా వచ్చాయి. 2019 ఫిబ్రవరిలో అయితే 23.39 మీటరర్ల లోతుకు నీటి మట్టం పడిపోయింది. తక్కువ భూగర్భ జలాలున్న సంవత్సరం 20 సంవత్సరాల్లో ఇదే కావడం గమనార్హం.

ఈ ఏడాది వర్షాలకు వచ్చిన నీరు 233.53 టిఎంసిలు

జిల్లాలో ఈఏడాది అధిక వర్షాలు పడ్డాయి. ఈ ఏడాది అనంతపురం జిల్లాలో 648 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఇది సాధారణం కంటే 40 శాతం అధికం. గతేడాది ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది పడిన మొత్తం వర్షాన్ని లెక్కగడితే 233.53 టిఎంసిల నీరు లభించినట్టయిందని భూగర్భ జల శాఖలెక్క గట్టింది. ఇందులో 28.02 టిఎంసిల నీటిని వివిధ స్ట్రక్చర్లలో ఒడిసి పట్టుకోగలిగినట్టు సమాచారం. అంటే 12 శాతం వరకు మాత్రమే నీటిని ఒడిసి పట్ట గలిగారు. తక్కిన నీరు బయటకెళ్లిపోయింది. మొత్తంగా ఈ ఏడాది వర్షాలతో గతంలో ఎన్నడూలేనంతగా భూగర్భ జలాలు పైకి రావడం హర్షణీయం.

సచివాలయ ఉద్యోగులను ఓటు అభ్యర్థిస్తున్న సిఐటియు నాయకులు

పోతుల నాగరాజుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు లోకేష్

ప్రజాశక్తి-డి.హీరేహాల్

2023 మార్చి నెలలో నిర్వహించనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు లోకేష్ పిలుపునిచ్చారు. సోమవారం రైతుసంఘం, సిఐటియు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో కలిసి మండలంలోని సచివాలయ ఉద్యోగులు, పట్టభద్రుల ఓటర్లను కలిసి నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయులు, కార్మిక, కర్షక రైతుల సమస్యలపై ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు రాజీలేని పోరాటాలు చేశారన్నారు. ఇలాంటి వ్యక్తికి పిడిఎఫ్‌తోపాటు అనేక ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు బలపరుస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి వ్యక్తి శాసనమండలిలో ఉంటే ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై గళం ఇవ్వడానికి మంచి అవకాశంగా భావించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శివరాజ్, సిఐటియు నాయకులు లింగన్న, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎగువ భద్ర నిర్మిస్తే రాయలసీమకు జలగండమే..

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

కర్ణాటక ప్రభుత్వం ఎగువభద్ర ప్రాజెక్టు పనులు చేపడితే భవిష్యత్తులో రాయలసీమకు జలగండం తప్పదని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో కాలవ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం రాయదుర్గం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో పరిశ్రమల ఏర్పాటులో, సాగునీటి ప్రాజెక్టులను నిర్మించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరానికి కేంద్ర నిధులు రాబట్టడంలో సిఎం జగన్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. ఎగువభద్రకు ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో రూ.5,300కోట్లు కేటాయించడం వైసిపి ఎంపీల అసమర్థతకు నిదర్శనమన్నారు. ఎగువ భద్ర ప్రాజెక్టుపై జగన్ సర్కారు ఎందుకు నోరెత్తడం లేదని ప్రశ్నించారు. రాయలసీమలో తెలుగుదేశం ప్రభుత్వంలో చేపట్టిన నీటి ప్రాజెక్టులను ఎందుకు చేయడం లేదని నిలదీశారు. చంద్రబాబు ప్రభుత్వం అప్పట్లో రాయలసీమ నీటి ప్రాజెక్టులకు రూ.10వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

జగన్‌రెడ్డి నాలుగేళ్లలో సాగు నీటి ప్రాజెక్టుల కోసం అందులో పాతిక శాతం కూడా ఖర్చు పెట్టలేదని మండిపడ్డారు. ఎగువ భద్ర ప్రాజెక్టు పనులను తక్షణమే ఆపకపోతే రాయలసీమ జిల్లాల్లోని రైతులను ఏకం చేసి నిరసనలు చేపడతామని హెచ్చరించారు. జగన్ అరాచక పాలనపై అన్నివర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. చదువుకున్న వాళ్లెవరూ వైసిపికి ఓటు వేసే ప్రసక్తే ఉండదన్నారు. జగన్ పాదయాత్రలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు రాయలసీమ జిల్లాల్లో కియా, సెల్‌కాన్ వంటి పరిశ్రమలతో వేలాది మందికి ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్లు కురుబ హనుమంతు, హనుమంతురెడ్డి, గిరిమల్లప్ప, లాలెప్ప, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి సంపత్‌కుమారి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెంకటేశులు, జిల్లా రైతు ఉపాధ్యక్షుడు వెంకటేశులు, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కడ్డిపూడి మహబూబ్‌బాషా, మోహన్‌రెడ్డి, నాగరాజు, ఆనంద్‌రాజు, జిల్లా కార్యదర్శులు బండి చిన్న, బోజరాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

నాణ్యమైన విద్యుత్‌ను అందించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టిడిపి యువనేత ఉన్నం మారుతీచౌదరి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కుందుర్పి మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులతో కలిసి విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల రైతులు లోఓల్టేజీ, జంపర్ కటింగ్, తదితర సమస్యలతో మోటార్లు కాలిపోయి నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారన్నారు. గతనెలలో విద్యుత్ వైర్లను మార్చి రైతుల సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన విద్యుత్ అధికారులు ఇప్పటికీ పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాయల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి గోళ్ల వెంకటేశులు, గోళ్ల సర్పంచి బొజ్జన్న, మాజీ సర్పంచి గోవిందరెడ్డి, అల్లాపురం, యర్రగుంట, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి యువనేత ఉన్నం మారుతీచౌదరి, రైతులు

నారాయణ జూనియర్ కళాశాలను సీజ్ చేయాల్సిందే..

ఆర్‌జెడి రవికి ఐక్య విద్యార్థి సంఘాల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను మానసికంగా వేధిస్తున్న నారాయణ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఇంటర్‌మీడియట్ బోర్డ్ ఆర్‌జెడి రవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుళ్లాయిస్వామి, ఎపిఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, ఎఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్, ఓసి విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్రా జయవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేకుండా బ్రాంచులు నడుపడం, అధిక ఫీజులు వసూలు చేయడం, ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిడికి గురి చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాల్సిన ఆర్‌ఐఓ సురేష్ యజమాన్యానికి వత్తాసు పలుకుతూ సహకరిస్తున్నట్లు ఉందన్నారు. ఒత్తిడి తట్టుకోలేక నారాయణ కళాశాల విద్యార్థిని భవ్యశ్రీ ఆత్మహత్యయత్నానికి పాల్పడిందన్నారు. బెంగళూరులో వైద్య చికిత్స పొందుతోందన్నారు. సదరు కళాశాల యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్న ఆర్‌ఐఓ సురేష్ బాబును తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. భవ్య శ్రీ ని వేధించిన నారాయణ కళాశాలను సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు గిరి, సూర్య, విజయ్, ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి రమణయ్య, నరసింహ యాదవ్, ఓసి విద్యార్థి సంఘం నాయకులు ఓబుల్‌రెడ్డి, మారుతి, హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జెడి రవికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మండలంలోని తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువను సిపిఐ రాష్ట్ర నాయకులు సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా 105వ కిలోమీటర్ హెచ్‌ఎల్‌సి కాలువ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు అన్ని ప్రాజెక్టులను పరిశీలించి వాటి స్థితిగతులపై నివేదికను తయారు చేసి మార్చిలో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తుంగభద్ర ప్రధాన కాలువ జలాశయం నుంచి 105వ కిలోమీటర్ల వరకు బోర్డు పరిధిలో మరమ్మతులు నాణ్యతతో చేశారని, 105వ కిలోమీటర్ల నుంచి 185వ కిలోమీటర్ వరకు 1994లో అప్పటి ప్రభుత్వం రూ.450 కోట్లతో మరమ్మతులు చేయాలని టెండర్లు నిర్వహించి అర్ధాంతరంగా వదిలేశారన్నారు. అలాగే 105వ కిలోమీటర్ల నుంచి ప్రధాన కాలువపై నాగలాపురం, నేరమెట్ల, దర్గా హొన్నూర్ ప్రాంతాల్లో కల్వర్టులు కూలి రైతు, కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి తుంగభద్ర ప్రధాన కాలువ ఇరువైపులా లైనింగ్‌లు, కల్వర్టులు, డిస్ట్రిబ్యూటర్ కల్వర్టులు నిర్మించి రైతులకు సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య, రామచంద్రయ్య, ప్రసాద్, జిల్లా కార్యదర్శి జగదీష్, సహకార కార్యదర్శి నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎల్‌సి కాలువను పరిశీస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

శాతవాహన వాహనాలతో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని శాతవాహన ఫ్యాక్టరీకి సంబంధించిన వాహనాలను అదుపు చేయాలని సర్పంచి కురువన్నమ్మ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాతవాహన ఫ్యాక్టరీకి సంబంధించిన లారీలు, టిప్పర్లు గ్రామ నడిబొడ్డున వేగంగా వెళ్తుండటంతో దుమ్మూధూళితో స్థానికులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అంతేకాకుండా ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థులు ప్రాణభయంతో వెళ్లాల్సి వస్తోందన్నారు. వెంటనే అధికారులు స్పందించి శాతవాహన ఫ్యాక్టరీ వాహనాల వేగాన్ని అదుపు చేయడంతోపాటు రోడ్డుకి ఇరువైపులా నీటిని పిచికారి చేయాలని, పాఠశాల వద్ద గుర్తులు పెట్టాలని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు హనుమంతప్ప, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్యశిబిరం

అనంతపురం కలెక్టరేట్ : చిన్న పిల్లల వైద్య విభాగం, డిఐఐసి, కిమ్స్ సవీరా వారి ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఉచిత చిన్న పిల్లల గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ డి.లింగస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలకు పుట్టుకతో వచ్చు గుండె జబ్బుల నిర్ధారణ, వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2డి ఎకో, ఈసిజి ద్వారా పిల్లలను పరీక్షించి గుండె సమస్యలు ఉన్న వారిని గుర్తించి అవసరమైన చికిత్స చేయబడుతుందన్నారు. సర్జరీ అవసరమైన పిల్లలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా సర్జరీ చేయడం జరుగుతుందన్నారు.

15న చింతచెట్ల వేలంపాట

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని పల్లెపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించి బళ్లారి రోడ్డు పక్కన, పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న చింతఫల సాయం కోసం ఈనెల 15న ఆంజనేయస్వామి ఆలయం వద్ద వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి హేమంత్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.వంద ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

నేడు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-స్పందనపై సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించి జిల్లా, మండల స్థాయి అధికారులతో జిల్లాల సుస్థిరాభివృద్ధి లక్షాలు- స్పందన కార్యక్రమంపై ఓరియంటేషన్, సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రణాళిక శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ సోమవారం తెలిపారు. నేడు ఉదయం 10 గంటలకు బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్ నందు నిర్వహిస్తున్న సమీక్షా సమావేశానికి రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి కెఆర్.విజయ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల రాష్ట్ర స్థాయి అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అనంతపురము, శ్రీ సత్య సాయి జిల్లాల కలెక్టర్లు, గ్రామ వార్డు సచివాలయ కార్యదర్శులు ఆరోగ్య, పాఠశాల విద్య, మహిళా స్త్రీ, శిశు సంక్షేమం, పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి, పురపాలిక, అటవీ, హెూమ్, రెవెన్యూ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే జిల్లా, మండల స్థాయి అధికారులు ఖచ్చితమైన నివేదికలతో సమయానికి హాజరు కావాలని కోరారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

రాయదుర్గం రూరల్ : సరోజినీనాయుడు జయంతి సందర్భంగా సోమవారం స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ సరోజినీనాయుడు ప్రతిభావంతురాలైన జాతీయ నాయకురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు, ప్రముఖ కవయిత్రి అన్నారు. ఆమెను మార్గదర్శకంగా తీసుకుని విద్యార్థినులు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఫరీసా, అధ్యాపకురాలు నాగమణి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ వేలంపాట వాయిదా

గుత్తి : మునిసిపాలిటీ పరిధిలో సుంకం వసూలు హక్కు కోసం ఈనెల 16వ తేదీన నిర్వహించాల్సిన బహిరంగ వేలం పాటను వాయిదా వేసినట్లు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ శరత్ చంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కెట్, జంతు వధశాలలో సుంకం వసూలు హక్కు కోసం 16న వేలం పాట నిర్వహించాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడం వల్ల వాయిదా వేశామని చెప్పారు. మార్చి 13 తరువాత మార్కెట్ బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL:
(on the file of Hon'ble 6th Addl. District Judge) GOOTY
O.P. No:92/2022

Between:
Sunkesula Sharmas Bee & 2 others ...Petitioners
And
1.Matam Ganesh (owner cum rider)
2.The Manager, legal cell, Cholamandalam Gen, Ins, Co. Ltd., Chennai ...Respondents

NOTICE TO RESPONDENT NO:1

To
R1: Matam Ganesh Son of M.Aparna, Major Hindu, owner of the motor cycle, bearing No.AP-39-ML-7843, r/at 4-1767-B, Bagya Nagar, 1st Cross, Kalyandurg Road, Ananthapuram Town and District. (RC owner cum rider of the offending vehicle)

పై దావాలోని మొదటి ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టువారు 01-03-2023 వ తేదిన వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని యెడల పై దావా మీ పరోక్షము నందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"
పి.చెన్నారెడ్డి, వాదిపరం వకీలు
అనంతపురం, సెల్:9440093880

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE: ANANTAPURAMU
I.A. 321/22 IN O.S.66/2011

Between:
1.Billa Lakshmanna (died) by lrs
2.Billa Lakshmidevi
3.B.L.Kiran Kumar
4.B.Swetha Yadav ...Petitioners
And
1.Billa Venkataswamy (died)
2.Billa Adenna (died)
3.Billa Lakshmidevi and 14 others ...Respondents

NOTICE TO R 14 to 16

R14: Billa Lalitha D/o Late Billa Venkataswamy W/o Billa Venkatanarayana, D.No.1-245, Sajjaladinne, Tadipatri Mandal, Anantapuramu District.
R15: Billa Jayamma D/o Late Billa Venkataswamy W/o Narayana swamy, Kothapeta Veedhi, Dharmavaram, Anantapuramu District.
R16: Billa Nallamma @ Golla Lalitha D/o Late Billa Venkataswamy W/o Golla Rajanarayana, Chabala Village, Peddapopur Mandal, Anantapuramu District.

The above I.A. 34/2021 stands posted to 02-03-2023 for your appearance. Please be attend on the said date befor the above mentioned court at 10.30 AM either in person or through advocate. Failing which the matter will proceed exparte.

(By order of the Court)

K.Sreenatha Reddy
Advocate for Petitioner
Anantapuramu, Cell:9440986932.

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE: ANANTHAPURAMU
(In the matter of obtaining permission to sell the property of minors Pabbisetty Naga Nikil Sai and Pabbisetty Varuni)
G.O.P. No:12/2023

Between:
Pabbisetty Venkatesh Babu S/o Pabbisetty Chinnaiah, aged 4 years, Hindu, r/o D.No.28-284, Boya Street, Old Town, Ananthapuramu Town. ...Petitioner
AND
NIL ...Respondents

ప్రకటన

పై నెంబరు కేసులో మైనరు బాలుడు అయిన **పబ్బిశెట్టి నాగ నిఖిల్ సాయి** మరియు మైనరు బాలిక అయిన **పబ్బిశెట్టి వరుణి**లు అయిన వారి తరఫున వారి తండ్రిగారు అయిన **పబ్బిశెట్టి వెంకటేష్ బాబు** గారు పై కోర్టు నందు మైనరు పిల్లల యొక్క ఆస్తిని వారి పోషనకు, విద్యాభివృద్ధికి, కుటుంబ నిర్వహణ ఖర్చుల నిమిత్తం మరియు లోకుల నుండి చేసిన అప్పులను తీర్చుట కొరకు పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. కావున ఎవరికైనా ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు 23-02-2023 వ తేది ఉదయం 10.30 గం॥లకు హాజరై ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు లేని యెడల పిటీషనరు పరమున తీర్మానము చేయబడును.

షెడ్యూలు:

Item No:1
Property situated at Bukkarayasamudram Village Polam and Panchayath Limits, Bukkarayasamudram Mandal, Ananthapuramu District with in the SRD of Ananthapuramu and RD of Ananthapuramu.

Govt.Dry	S.No.	A.C.	Plot No:	A.C	A.C
	630-3	0.43 paiki	7,8,9	0.09.33 paiki	0.02.33

Bounded by:
East:Plot No.3&4, **West:** 20feet Road, **North:**Remaining Plot in Same Plot and aslo land of others, **South:**Remaining Plot in Same Plot belonging to K.Rajasekhar Naidu.
Measuring:
East:-West: on Northern side 43.5 feet or 13.26 mtrs. **East-West**: on Sourthern side 44.6 feet or 13.56 mtrs. **North-South:** on Eastern side 24.6 feet or 7.46 mtrs. North-South:on Western side 23-2 feet or 7.07 mtrs.

Item No:2
Property situated within the RD of Ananthapuramu and SRD of Ananthapuramu, within the Anantapuramu Municipal Corporation Limits, Ananthapuramu.

WARD	T.S.No:	EXTENT
Old-8	1959-7B	A.C.1.63 paiki A.C. 1-44 paiki A.C. 0.06 1/2 paiki
New-21 Present-28	1960-5	A.C.00.22paiki D.No.28-345-10, 28-471

Out of the above said property the House and Open Site.
Bounded By:
East: House of M.Sundara Rao, **South:**33 feet wide Road, **West:**House of Narayana Ramaiah in same, S.No, **North:** House of others.
Measuring
East-West:10 feet, **North-South:**48 feet.
Total:53.33 Sq.yards.

"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"
V.BHARADWAJA PADMANABHA TEJA
Advocate, Ananthapuramu, Cell:9700713342.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-గుంతకల్లు

ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, రైతు, కార్మిక సమస్యలపై చట్ట సభలలో గళం వినిపించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ కోరారు. సోమవారం పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని డాక్టర్ గేయానంద్ సిపిఎం నాయకులతో పాటు శ్రీ శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ నాయుడు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్ట భద్రుల నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసన మండలికి పంపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా రాయలసీమ ప్రాంతం అభివృద్ధికి అనేకమైన హామీలు ఇచ్చిందన్నారు. ప్రధానంగా మన ప్రాంతంలో నిరుద్యోగ, ఉద్యోగ, కార్మిక సమస్యల పైన శాసన మండళిలో ప్రజా గళం వినిపిస్తామని చెప్పి ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని గెలిచిన తర్వాత వారు ఇప్పటివరకు కనిపించని పరిస్థితి ఉందన్నారు. డాక్టర్ పోతుల నాగరాజు ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తినే వదులుకుని మన ప్రాంతంలో అనేక సమస్యల నడుమ నలిగిపోతున్న నిరుద్యోగ, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి సమస్యలపైన నిరంతరం రాజీలేని పోరాటలు చేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తిని శాసన మండలికి పంపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఓటర్లను కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గత ఎన్నికల్లో కత్తి నరసింహారెడ్డి గెలిచిన తర్వాత నాటి నుంచి నేటి వరకు ఆయన ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపైన, సిపిఎస్ పైన రాజీలేని పోరాటాలు చేస్తూ ఉన్నాడన్నారు. ఆయన కూడా ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో ఉన్నారన్నారు. వారిద్దరికీ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి చట్ట సభలకు పంపాలని ఉద్యోగ, ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, పట్టణ కార్యవర్గ సభ్యులు కసాపురం రమేష్, సాకే నాగరాజు జగ్గలి రమేష్, తిమ్మప్ప, రాము నాయక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్, పట్టణ నాయకులు చరణ్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో ఎన్నికల ప్రచారం

గుంతకల్లులో ఎన్నికల ప్రచారం చేస్తున్న గేయానంద్

గుత్తి : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజుకు మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ గుత్తిలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, న్యాయస్థానాల ప్రాంగణం, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల ఆవరణలో ఆయన ప్రజా సంఘాల నాయకులతో కలిసి ప్రచారం చేశారు. మంచి వ్యక్తి అయిన పోతుల నాగరాజును గెలిపిస్తే అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం పాటుపడతారని ఈ సందర్భంగా డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు నాగరాజుకు వేసి, వేయించి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వి. నిర్మల, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్నీ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, గౌతమ్ నాయక్, శివా నాయక్, సామాజిక కార్యకర్త పవన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రజాపురం గ్రామంలో రాయలసీమ విమోచన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైర్ స్టేషన్ లేకపోవడం వల్ల అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. మండల కేంద్రంలో రెండు జాతీయ రహదారులు ఉన్నాయని వేలాది వాహనాలు ప్రతినిత్యం రాకపోకలు సాగిస్తున్నాయని చెప్పారు. పెట్రోలు, డీజిల్ నిల్వ కేంద్రాలు ఉన్నాయన్నారు. పెట్రోలు తరలించే వాహనాలు తిరుగుతూ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. రైల్వేస్టేషన్ గుండా కూడా నిత్యం రైళ్ల వివిధ సరుకులు పెట్రోలు రవాణా చేస్తున్నాయని చెప్పారు. గతంలో బొగ్గును రవాణా చేసే గూడ్స్ రైళ్లలో అగ్నిప్రమాదాలు సంభవించాయని గుర్తు చేశారు. ప్రభుత్వం నూతన అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలో గుత్తిని పరిగణలోకి తీసుకోవాలన్నారు. అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ విమోచన సమితి నాయకులు జ్ఞానేశ్వర్, సాయికుమార్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్ర జట్టుకు బిసి హాస్టల్ విద్యార్థుల ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహం విద్యార్థులు ఎన్నికయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-17 కబడ్డీ పోటీలలో పాల్గొన్న వసతి గృహ విద్యార్థులు కె.రాహేల్ రాణి, కె.నందిని, కె.మణి ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోలీలకు ఎన్నికయ్యారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి, సూపరింటెండెంట్ నాగరత్నమ్మ, అనంతపురం డివిజన్ సహాయ బీసీ సంక్షేమ అధికారి సుభాషిని, వసతి గృహ సంక్షేమ అధికారి టి.ఆదిలక్ష్మి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా పతకాలను సాధించాలని ఆశీర్వదించారు.

అప్పర్ భద్రను అడ్డుకోకపోతే రాష్ట్రం ఎడారే..

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడు

ప్రజాశక్తి-గుంతకల్లు

కర్నాటక రాష్ట్రంలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును వైసిపి ప్రభుత్వం అడ్డుకోకపోతే రాష్ట్రం ఎడారిగా మారుతుందని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడు అన్నారు. సిఎం జగన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు మానుకుని కేంద్రంతో చర్చలు జరిపి రాష్ట్ర ప్రయోజనాల కాపాడాలన్నారు. లేకపోతే రాష్ట్ర ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. సోమవారం గుంతకల్లు పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కర్నాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్టును నిర్మించేందుకు పార్లమెంటులో తీర్మానాన్ని ప్రవేశపెడితే వైసిపి ఎంపీలు ఆ ప్రాజెక్టు నిర్మాణానికి ఆక్షేపణ కూడా చెప్పకపోవడం సిగ్గుచేటన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే రాయలసీమ ప్రాంతంలోని రైతులకు, ప్రజలకు సాగు, తాగునీటి కష్టాలు ఎదురవుతాయని అన్నారు. ఇప్పటికే తుంగభద్ర నుండి రాయలసీమ ప్రాంతానికి నీటి కోటా సక్రమంగా రాకపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కృష్ణా జలాలు హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా జిల్లాలకు రాకపోయి ఉంటే ఈ ప్రాంత ప్రజలకు కనీసం తాగునీరు కూడా అందక కష్టాల పాలయ్యేవారన్నారు. పంటలు పండక రైతులు తమ భూములను బీడు భూములుగా వదిలేసుకునే ప్రమాదం పొంచి ఉండేదన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపులు మానుకొని ప్రతిపక్షాలను కలుపుకొని అప్పర్ భద్ర నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధం కావాలన్నారు. ఏపీ రాష్ట్రానికి అడుగడుగునా ద్రోహం చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంపై కక్ష సాధింపుతోనే కర్నాటక రాష్ట్రంలో అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులతో పాటు నిధులను కూడా మంజూరు చేసిందన్నారు. ఈ నిర్ణయాన్ని టిడిపి సహించదన్నారు. ప్రతిపక్షాలను, ప్రజాసంఘాలను ఏకం చేసి అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ప్రజా ఉద్యమాలను చేపడతామని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు తలారి మస్తానప్ప, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, జింకల జగన్నాథ్, హనుమంతు, ఆటో ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జితేంద్రగౌడ్

తన కుటుంబాన్ని ఆదుకోవాలని ఎస్‌పికి రైతు వినతి

ప్రజాశక్తి-పుట్లూరు

తన కుటుంబాన్ని ఆదుకోవాలని పుట్లూరు మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన రైతు నాగమయ్య స్పందన కార్యక్రమంలో అనంతపురం ఎస్‌పి ఫక్కీరప్పకు సోమవారం వినతిచేశారు. వివరాల్లోకి వెళ్తే.. పుట్లూరు మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన నాగమయ్య, కడవకల్లు గ్రామానికి చెందిన జయరాంరెడ్డి కూడేరు మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులుకి చెందతిన 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. అందులో అరటిపంట సాగు చేశారు. ఒక్కొక్కరు పెట్టుబడి కింద రూ.2.50 లక్షలు ఖర్చుచేశారు. కౌలుకు తీసుకున్న ఆరు నెలలకు రైతు నాగమయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. నడవలేని స్థితిలో ఉన్న నాగమయ్య దగ్గరకు జయరాంరెడ్డి వచ్చాడు. నీవేమీ దిగులు చెందవద్దని పొలాన్ని నేనే చూసుకుంటానని చెప్పాడు. దిగుబడి వచ్చిన తర్వాత పెట్టుబడి రూ.2.50 లక్షలతో పాటు వడ్డీ కూడా ఇస్తానని నమ్మబలికాడు. అయితే పంటచేతికొచ్చి విక్రయించినా డబ్బు చెల్లించలేదని రైతు సోమయ్య వాపోయాడు. తనకు అప్పు ఇచ్చిన వారు ఒత్తిడితెస్తున్నారన్నారు. వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని తనకు, తన కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్‌పిని కోరాడు. లేనిపక్షంలో తనకు ఆత్మహత్యే శరణ్యమని కన్నీటిపర్యంతమయ్యాడు.

మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

సాంకేతికతతో ఆశించిన దిగుబడి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సాంకేతికతతో మంచి దిగుబడి సాధించవచ్చని ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ముకుందరావు అన్నారు. సోమవారం రెడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో 41వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరిగింది. అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎన్‌సి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ముకుందరావు హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్ర నాయక్, వెటర్నరీ డైరెక్టర్ మురళి, శాస్త్రవేత్తలు డాక్టర్ వై.పద్మలత, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ సహదేవరెడ్డి, డాక్టర్ దీప్తి, ఆత్మ డైరెక్టర్ మద్దిలేటి, ఎపిఎంఐపి డైరెక్టర్ నాగరాజు రెడ్డి పాల్గొన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు 2022-23లో ప్రతిపాదించిన పరిశోధనలను వాటి ఫలితాలను తెలియజేశారు. 2023-24 సంవత్సరానికి ప్రతిపాదించబోయే పరిశోధనలను ప్రజెంట్ చేశారు. రైతు సమస్యలను పరిగణలోకి తీసుకొని పరిశోధనలు చేయాలని డైరెక్టర్ ముకుందరావు సూచించారు. జిల్లాలో వేరుశనగ కంది ఆముదం పంటలలో మంచి టెక్నాలజీ మన జిల్లా రైతులకు అందించే విధంగా పరిశోధనలు చేయాలని జాయింట్ డైరెక్టర్ చంద్ర నాయక్ కోరారు. శాస్త్రవేత్తలు తెలియజేసిన సలహాలను ఈ సంవత్సరం పరిగణలోకి తీసుకొని పరిశోధనలు చేసి మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి విజ్ఞాన కేంద్రం ఎల్లప్పుడూ పనిచేస్తుందని కెవికె అధిపతి డాక్టర్ మల్లీశ్వరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధారాణి, శశికళ, కిషోర్‌రెడ్డి, మాధవి, చందన, ప్రోగ్రాం అసిస్టెంట్ వేణు, రంగనాయుడు, ముత్యాలరావు, ఆదర్శ రైతులు చెన్నారెడ్డి, రాము, నిర్మల నాయక్, గంగమ్మ రఘురాం, రెడ్డిపల్లి రైతులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ విజయప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అజెండాలోని పలు అంశాలపై చర్చిస్తామని చెప్పారు. సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పాసుపోర్టు పోగొట్టుకు పోయినది
గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్ బండి మోటు వీధిలో ఇంటి నెంబర్.9/452లో నివాసం ఉండే ఆర్.రాజా (రవిచంద్రన్) S/o జె.రవిచంద్రన్ అను నేను బస్సులో వెళ్తుండగా బ్యాగ్ లో ఉన్న పాసుపోర్టు (L9309503) ఎక్కడో పోగొట్టుకుపోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది సెల్ నెంబర్ సంప్రదించగలరని కోరుతున్నాను.
సెల్:9966882273

విద్యార్థుల ఎదుగుదలలో సాఫ్ట్ స్కిల్స్ ప్రభావం

బెంగళూరు ఎమిటి యూనివర్సిటీ డైరెక్టర్ సునీల్

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థుల కెరీర్ ఎదుగదలలో సాఫ్ట్ స్కిల్స్ ప్రభావం తప్పనిసరిగా ఉంటుందని బెంగళూరు ఎమిటి యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టరు సునీల్ బి రావ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పివికెకె డిగ్రీ, పీజీ కళాశాలలో ఫ్యూచర్ వర్క్ ఫోర్స్ పేరుతో ఒక రోజు సెమినార్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా వై.మునికృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థుల అభివృద్ధిపై జ్ఞానంతో పాటు విధేయత, విలువలు కూడా ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత పౌరుల ఉద్యోగ అభివృద్ధి అవకాశాల కోసం ఉపయోగపడే మాస్ కమ్యునికేషన్ జనరేషన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని వివరించారు. తమ కళాశాలలో విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి కోసం తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. వీరితో పాటు ఎంఎంఎస్ కోఆర్డినేటర్ వెంకట్ కుమార్, కేశవయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని వినతి

అనంతపురం : ప్రయివేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని ఆపుస్మా జిల్లా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి గాజుల చంద్ర నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు డిఇఒ సాయిరాంకు సోమవారం వినతి చేశారు. అనంతపురం నూతన డిఇఒగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా, ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని అపుస్మా నాయకులు డిఇఒను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రయివేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను డిఇఒ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించాలని కోరారు. అందుకు డిఇఒ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆపుస్మా జిల్లా నాయకులు, లక్ష్మీస్కూల్ మధుసూదరెడ్డి, ప్రశాంతి స్కూల్ ఎస్ఎం.ఇక్బాల్, బాలాజీ రామిరెడ్డి, నవభారత్ శషిభూషణ్, ఆదర్శ రవీంద్రరెడ్డి, మహాత్మాగాంధీ స్కూల్ అన్వర్, గౌతమి రఘునాథరెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిప్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరాం

అనంతపురం సిటీ : ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు యూనిసెఫ్ వారి సౌజన్యంతో పాఠశాల విద్యా శాఖ స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్‌ను అమలుచేస్తోందని డిఇఒ సాయిరాం తెలిపారు. ఇందుకు గాను సిపి ఆన్‌లైన్ పోర్టల్‌లో ప్రతి ఉన్నత పాఠశాల, 8వ ఆతరగతి ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలు తప్పనిసరిగా రిజిస్టర్ అవ్వాలన్నారు. ఆయా పాఠశాలల నుంచి ఒక సైన్స్ ఉపాధ్యాయులు లేదా గణిత ఉపాధ్యాయులు, వీరెవరూ లేని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా నోడల్ ఉపాధ్యాయులుగా నమోదు చేసుకుని, 8, 9, 10 తరగతులు చదువుతున్న 25 మంది విద్యార్థులను కూడా రిజిష్టర్ చేయాలని ఆదేశించారు. సిప్ ప్రగతిని కమిషనర్ వారు నేరుగా పరిశీలిస్తున్నారని, మంగళవారం సాయంత్రంలోగా సిప్ లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. సందేహాల నివృత్తి కోసం 78931 27358 రితికా, 6304 646559 గణేష్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాక్సింగ్ క్రీడలో విద్యార్థినికి బంగారు పతకం

గుత్తి : జిల్లాస్థాయి బాక్సింగ్ క్రీడా పోటీల్లో విజయం సాధించిన గుత్తి ఏపీ ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థిని జ్ఞానశ్రీకి బంగారు పతకం లభించింది. కళాశాలలో రెండో సంవత్సరం ఇంటర్ చదువుతున్న జ్ఞానశ్రీ ఏపీ రాష్ట్ర క్రీడా ప్రాధికారత సంస్థ నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ ఎన్.ఉషా తెలిపారు. రాష్ట్రస్థాయి బాక్సింగ్ క్రీడా పోటీలకు ఎంపికయిందని ఆమె చెప్పారు. బంగారు పతకం సాధించిన జ్ఞానశ్రీని ప్రిన్సిపల్ ఎన్.ఉష, ఫిజికల్ డైరెక్టర్ సుధా, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

మహాసభలను విజయవంతం చేయండి

శింగనమల : కలకత్తాలోని హౌరా నగరంలో ఈనెల 15 నుండి 18వ తేదీ వరకు జరిగే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి సుంకన్న పిలుపునిచ్చారు. మహాసభల సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం జెండా ఆవిష్కరించారు. నాయకులు రామాంజనేయులు, పుష్పరాజు ఎర్రిస్వామి, సాంబశివుడు, నవీన్, నారాయణ, రామాంజనేయులు, నాగేష్, చంద్రప్ప నారప్ప, వీరు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

అనంతపురం సిటీ : ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ షాదీఖానాలో పిఎస్ఒలకు, మొబలైజేషన్‌లో ఉన్న హోంగార్డులకు సోమవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఎఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు పర్యవేక్షణలో ప్రతి ఒక్కరికీ వాసన్ ఐ కేర్ వారి సౌజన్యంతో కంటి పరీక్షలు చేశారు.

పశు గ్రాసం దగ్ధం

పెద్దవడుగూరు : రావులుడికి గ్రామంలో విద్యుత్తు తీగలు తగిలి సోమవారం పశుగ్రాసం దగ్ధమైంది. తాడిపత్రి మండలం యర్రగుంటపల్లికి చెందిన కొందరు రైతులు కొండుపల్లి గనుల్లో పనులు చేయడానికి వచ్చి ట్రాక్టరులో పశుగ్రాసాన్ని తీసుకుని బయలుదేరారు. ట్రాక్టరు రావులుడికి గ్రామ సమీపంలోకి రాగానే పశుగ్రాసానికి విద్యుత్తు తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. రూ.15 వేలు విలువజేసే గ్రాసం దగ్ధమైనట్లు బాధిత రైతులు తెలిపారు.

ఎంపిడిఒకు ఘన సన్మానం

ఉరవకొండ : ఉరవకొండ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన చంద్రమౌళిని వైసిపి నాయకులు అభినందించి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సన్మానించారు. మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, మండల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు తిప్పయ్య, వైసిపి పట్టణ అధ్యక్షులు ఓబులేసు, పార్టీ బీసీ సంఘం నాయకులు ఉలిగప్ప, ఆంజనేయులు, ముండాస్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

పెద్దపప్పూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి రామ్మూర్తిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి రమాదేవి, ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ ఏ ఒక్క శాఖలోనూ లోటుపాట్లు ఉండకూడదని, ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో పప్పుశెనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, క్వింటాల్ రూ.535 ధరతో కొనుగోలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు బాషా, వైద్యాధికారి ఉషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రసాద్ మండల ఇంజినీర్ ప్రసన్నకుమార్‌రెడ్డి, ఉద్యాన అధికారి ఉమాదేవి, ఎంఇఒ శ్రీదేవి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కళావతి, ఐసిడిసి సూపర్‌వైజర్ దస్తగిరమ్మ, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా హైమాక్స్ లైట్ల ఏర్పాటు పనులు

ఉరవకొండ : ఉరవకొండ మేజర్ పంచాయతీ సుందరీకరణలో భాగంగా ఉరవకొండ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న హైమాక్స్ లైట్ల నిర్మాణం పనులు వేగవంతంగా సాగుతున్నాయి. వైఎస్సార్ సర్కిల్, బైపాస్, కనేకల్ క్రాస్, గుంతకల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రూ.10 లక్షల పంచాయతీ నిధులతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం వైఎస్సార్ సర్కిల్ వద్ద బెడ్డింగ్ పిల్లర్ నిర్మాణ పనులను వైసిపి ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, వార్డు సభ్యులు నిరంజన్ గౌడ్, శర్మాస్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి, పంచాయతీ పాలకవర్గ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని వారు తెలిపారు. వారితో పాటు నాయకులు అటో శీనా, రఫిక్, తాజుద్దీన్, శర్మాస్ వలి, చాకలి చిన్నా, శేఖర్, కవిత రియాజ్ తదితరులు ఉన్నారు.

చట్టపరంగా ప్రజా సమస్యలను పరిష్కరించండి

ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి

అనంతపురం సిటీ : చట్టపరంగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎస్‌పి ఫక్కీరప్ప కాగినెల్లి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలమూలల నుండి వచ్చిన ప్రజలు తమ బాధలు, సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకుని పిటిషన్లు అందజేశారు. ప్రతీ పిటీషనర్‌తో ఎస్‌పి ముఖాముఖిగా మాట్లాడారు. ప్రజల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని సంబంధిత పోలీసు అధికారులకు ఎస్‌పి ఆదేశాలు జారీ చేశారు. అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు పాల్గొన్నారు.

ప్రామాణికంగా క్రియాశీలక సభ్యత్వం

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

అనంతపురం : జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యత్వం ఎంతో ప్రామాణికం సంతరించుకొని ఉందని..ఈ సభ్యత్వం ద్వారా రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తించేలా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కృషి చేయడం కార్యకర్తల పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి టిసి.వరుణ్ అన్నారు. జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, సభ్యులు నాగబాబు ఆదేశాల మేరకు సప్తగిరి సర్కిల్ లోని పార్టీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఆధార్ కార్డ్, పాస్ ఫోటో, నామిని ఆధార్‌తో పాటుగా రూ.500 సభ్యత్వ రసుం చెల్లించి క్రియాశీలక సభ్యత్వం చేసుకోవచ్చని తెలిపారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

గుంతకల్లు : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు సోమవారం తమ విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యూనస్, సి.గోపాలకృష్ణ మాట్లాడుతూ కర్నూలు జిల్లా డోన్ కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయవాది పులి దామోదర్‌పై కొందరు వ్యక్తులు దాడి చేశారన్నారు. ఆ దాడిని నిరసిస్తూ తాము కోర్డులో విధులను బహిష్కరించామని చెప్పారు. భవిష్యత్తులో న్యాయవాదులపై ఇలాంటి దుర్ఘట నలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదులు బిఎస్.కృష్ణారెడ్డి, ఆర్.బడేసాబ్ పాల్గొన్నారు.